# పవిత్రప్రేమ

శ్రీ ఆళ్ల పిచ్చయ్య

ఆకాశం పగిలిపోయినట్లు జోరున వర్షం కురుస్తూ వుంది. కారు మబ్బులు ఉరుముల మెరుపులలో గూడి ఢీ కొంటున్నాయి' సౌదామిని తీగెలు విచ్చల విడిగా విజృంభిస్తున్నాయి. గాలి జోరున భయంకరంగా వీస్తూవుంది. కార్మిక కర్షక జనముల పూరి గుడిశెలు గాలి తాపిడికి ఆగలేక ఎగిరి పోతున్నాయి! అంతా భయంకరంగా వుంది. అలాంటి భీకర సమయములో గుంటూరు రైల్వే స్టేషన్ దగ్గర జట్కా బండి ఆగింది. అందులోనుండి యిద్దరు వ్యక్తులు దిగి, జట్కా వాలా సుబ్బడి చేతుల్లో అర్ధరూపాయి బిళ్ళ వుంచి వెయిటింగ్ రూములోకి గబగబ వెళ్ళినారు. ఇంకా రైలుబండి రాలేదు, మిణుకు మిణుకుమనే దీపం ముందు పెట్టుకొని, చలిగాలికి వణకుచున్న గ్రాసర్ వద్ద నాలుగు కేకూ్స, రెండు రొట్టెపిలూ్స, అరడజను చక్రకేళీ, రెండు కప్పుల 'టీ' తీసుకొనివచ్చి యిద్దరూ టిఫెన్ తీసుకున్నారు. టికెట్సు తీసుకొనేలోపల రైలు వచ్చింది. ఆ యిద్దరు వ్యక్తులూ సెకెండు క్లాసులో కూర్చొని. క్యారేజి తలుపులు మూసివేసి, కూర్చున్నారు. రైలు ధనవంతుల నిరంకుశత్వముక్రింద బాధపడే కార్మికుడులా అరుస్తూ కదలి సాగింది.

'సరూ, చలిగాలి వీస్తుంది. యీ స్వెట్టర్ తొడుక్కో, వెచ్చగా వుంటుంది'

'అక్కర్లేదులే ప్రసాద్, నీవు తొడుక్కో కదూ'

'నాకు వేరే వుందిలే. యిదిగో తీసుకో' అని సూట్ కేసులోనుండి స్వెటర్, మఫ్లర్ తీసి, సరస్వతికి యిచ్చి, ఆమె ప్రక్కన కూర్చున్నాడు ప్రసాదరావు.

రైలుబండి ఏడ్పు ముఖంతో గోలచేస్తూ, విధిలేక గాలివానలో ముందుకు సాగిపోతూవుంది. ఉరుములు అల్లరి చేస్తున్నాయి భయంచేత సరస్వతి ప్రసాద్ ఒళ్లో తల దాచుకొని, కండ్లు మూసుకుంది! ప్రసాద్ ఆమె తలనిమురుతూ, యింత పిరికి పిల్లవే సరూ' అంటూ జ్యోత్స్నకాంతులతో- సౌందర్యచ్ఛాయలీనే రోజాలాంటి ఆమె చెక్కిలిమీద కొంటెగా చిటిక వేశాడు. ఆమె సహజమైన లజ్జ అభినయించింది.

'ప్రసాద్, మన యిద్దరి హృదయాలు యేకమైనవిగాని ఓర్వలేని సంఘం కనులారా చూస్తూ, వూరకుంటుందా?'

'అవును సరూ, మనకు సంఘంతో పని యేముంది? దాన్ని తిరస్కరించే కదూ యీ మార్గమవలంబించింది మనము'

'అయితే, మన భావికర్తవ్యమేమిటంటావ్'

'ఏమిటా, మన పూర్ణ హృదయ కలశాలను పవిత్రప్రేమ మధువుతో నింపుటయే'

మరునాడు 12 గంటలకు సెంట్రల్ స్టేషనులో దిగి, దగ్గరనున్న కుట్టి చెట్టియార్ సత్రములో బస చేశారు, ఆ మరునాడు సుందరమైన భవనము అద్దెకు తీసుకొని దానిలో ప్రవేశించారు. వారి జీవితాలలో మధుమాసములు మరలిపోయినాయి. పరస్పర హృదయాలలో ప్రేమజ్యోతులు వెలిగించి, వారి ఎడతెగని సందర్శనాలనే చమురుచే దినదినాభివృద్ధిగా వాటిని ప్రజ్వలింప జేసుకొన్నారు. వారిది కామించని ప్రేమ వారు ప్రేమమయులు ఆనందమూర్తులు.

♦ ♦ ♦

అసలు ప్రసాదరావు గొప్పయింటి బిడ్డ. డిగ్రీ కాస్తా పుచ్చుకున్నాడు. మంచి స్ఫురద్రూపి. జ్యోతిర్మయాలాంటి నయనాలు. గంగా యమునాలాంటి క్రాపు, చక్కటి ఫేషియల్ కట్—చాలా మనోహరంగా వుండేవాడు. అతని తండ్రి సుబ్బారావు నాయుడు లక్షాధికారి. అందువలన ఏకైక పుత్రుడు ప్రసాదు చేతుల్లో ధనలక్ష్మి కళకళలాడుతూ వుండేది. అతనికి కవి హృదయముంది. ప్రకృతిని ప్రేమించి, ఉషాంగు గంభీరభావ గర్భములైనకవన, మాలలల్లి, ప్రకృతి కన్యకు అంకితము చేస్తూ వుండేవాడు.

వారి యింటెదురుగనే ఆంజనేయ పంతులుగారి యిల్లు. పంతులుగారు తాలూకా కచ్చేరిలో హెడ్ క్లర్కు ఉదయము 8 గంటలు మొదలు రాత్రి 8 కొట్టేదాకా (ఏదో భోజనము, నస్యం పీల్చేవేళలు తప్ప)

పొగాకు వాసనవేసే ఆఫీసు కాగితాలలో స్నానం చేస్తూ వ్యక్తిత్వాన్ని చంపుకున్న పంతులుగారికి ప్రపంచ జ్ఞానం మృగ్యం అనడంలో ఆశ్చర్యమేముంది? పైగా గొప్ప సనాతన చక్రవర్తి. అతను హయాములో ఎంత వెలిగాడో, ఎందర్ని తిప్పలు పెట్టాడో ఏమిటో ఆ కోర్టు గుమస్తాలకు' వ్యాజ్యాలకు ధనం ధారపోసే ఆ పార్టీలకు ఏమి తెలియక, తన బిడ్డను మరియొక బిడ్డ పీల్చి పిప్పిచేస్తుంటే చేతులు నలుపుకుంటూ చూస్తూ వుండే ఆ దేవునికే తెలుస్తుందిగాని మనబోటి యువకులకు ఏమి తెలుస్తుంది? గోష్పాదమంత నాలుగు పరకలి జుట్టును కప్పిపుచ్చే మార్వాడీ తలకట్టు. మోకాళ్ళ వరకూ దిగబడిన నల్లటికోటూ, మెడచుట్టూ బిగుతుగా రుద్రాక్షదండా. కానీ వెడల్పైన కుంకుమ బొట్టూ, తళతళ మెరసే చెవిపోగులు అంతా మైసూరు సంగీత విద్వాంసుడిలా వుండేవాడు. అతనికి పదిరూపాయలు చేతిలో పడితేచాలు. పార్టీలకు నిముషంలో కోర్టుపని అయేది. కాని యిప్పుడు కాలము మారిపోయింది. ఐదవ పదిలో పడ్డాడు తొయ్యి మీసంలాంటి మీసాన్ని దింపాలసొచ్చింది. అతని రెండవభార్య అనసూయకు, జన్మించింది సరస్వతి. ముగ్ధత్వ మాధుర్య పెంపుచే చెన్నొందిన ఆ యశోవతిని సంఘం క్రూరంగా బలి కొంది, కర్కశ హృదయముతో చిన్నతనములోనే వితంతువుగా చేసింది. లోకజ్ఞానమెరుగని ఆ సుకుమార బాలిక; తన భర్త చనిపోయినప్పుడు బంధువులు ఏడుస్తుంటే అదికూడా ఆటే అనుకుందిపాపం. తదుపరి వసంతాలు గడుచిపోయిన కొద్ది సొంపునింపు అవయవ పొందికతోబాటు అభిరూప్యచ్ఛాయలు తొంగి చూశాయి. మంకెన పువ్వులాంటి అరుణాధరాలు, మన్మథోద్దీపకమయిన యౌవ్వనము జాకెట్టులోనుండి కొంటెగా దొంగగా తొంగి తొంగిచూసే పీఠభూముల్లాంటి వలుదగుబ్బ, నడుస్తున్నప్పుడు మడమలు ముద్దెట్టుకుంటూ నాట్యమాడే నల్ల త్రాచుపాములాంటి జడ (తండ్రికి తెలియకుండా వేసుకున్నప్పుడు) నొసలమధ్య బొట్టులాంటి మచ్చ—నిజంగా సృష్టికర్త స్త్రీని ఎందుకు సృష్టించాడో సరస్వతి మూలకంగా తెలుసుకోవచ్చు.

◆ ◆ ◆

ఒకనాటి సాయంకాలము ఎఱ్ఱచారల చీర ధరించిన పశ్చిమదేవిని మోహించి, పతంగుడు అపరంజి ఎండనే చిరునవ్వుతో ఆహ్వానించు సమయాన కిటికీ ముందు యీజీచైర్‌లో పండుకొని 'ఎమిలీ జోలా' రచియించిన 'Barbed wire' చదువుచున్న ప్రసాదరావు, అతనివంక తదేకదృష్టితో చూస్తున్న సరస్వతి చూపులు కలుసుకున్నాయి. Love at the first sight అనే సిద్ధాంతము వీరియెడ అనుకూలమయింది. వారి నయనాలు పరిభాషలో మాట్లాడుకున్నాయి. ఒకరికొకరి హృదయాలు ఆహ్వానించుకున్నాయి. తదుపరి సమయముచూచుకొని ఏకాంతంగా సరస్వతిని ప్రసాద్ కలుసుకొని, హృదయవేదనను వెడలి గ్రక్కి, ఇదిగో హృదయాన్ని తీసుకోమన్నాడు. ప్రత్యుత్తరంగా కళంకమున్నదేమో హృదయం చీల్చి పరీక్షించమంది సరస్వతి. ఇద్దరూ ఒకరిలోనొకరు ప్రేమగొడుగులను ఎత్తుకున్నారు. వలపుకు స్థానం యివ్వకూడదని శపథంగావించుకున్నారు. కాని లోకం అనుమానంగా చూస్తూవుంది వారివైపు. అక్కడక్కడ బావులదగ్గర, చెరువులవద్ద, చెట్లక్రింద, దేవాలయాల్లో వీరిగురించి గుసగుసలు ప్రారంభించాయి. సుబ్బారావు నాయుడు కొడుకును మందలించాడు. మరో లక్షాధికారి కోటీశ్వరరావుగారి కుమార్తె సరోజినికి, పసాద్‌కు వివాహ సంబంధము కుదిర్చాడు తండ్రి. సరస్వతికి కట్టుదిట్టాలు ఎక్కువయినాయి. పంతులుగారు ఉగ్ర నరసింహావతారమెత్తినారు. అలాగే రెండు క్యాలెండరు కాగితాలు చినిగిపోయినాయి. ఒకనాటి సాయంకాలము ఎలాగో రహస్యంగా కోవెలలో సరస్వతిని కలుసుకొని ఎక్కడకన్నా వెళ్ళి ప్రేమలో స్వేచ్ఛగా లీనమయిపోదామని చెప్పాడు ప్రసాదరావు. సరే నన్నది మీనాక్షి. దేవుడుకూడా సహాయపడ్డాడు గాలివాన వచ్చింది. వీలు గాసుకొని బయలుదేరినారు ప్రేమవిహారానికై ఆ ప్రేమమయులిద్దరు. మద్రాసులో మధుర జీవితాన్ని గడుపుతున్నారు.

ఆ నాడు ఆదివారం. సమయము దాదాపు ఉదయం 8 గంటలవుతుంది. క్రిస్టమస్ రోజులని మదరాసు జనమంతా ఉత్సాహములో వేడుకలు చూడడానికి వెళ్లుచున్నారు. పరుపుమీద పరుండి సరస్వతి ప్రసాద్ చిత్రాన్ని ఏకదీక్షగా చూస్తూ హృదయములోనుండి పొంగుచున్న భావతరంగిణితో ప్రేమగీతాన్నిపాడుచున్న సమయాన ప్రసాదు ఆతురతో వచ్చి చేతిలోనున్న ఆంధ్ర పత్రికను ఆమెకు చూపిస్తూ, 'సరూ, వెధవ సంఘం మనవెంట తరుముకొని వస్తూనే

వుంది. ఇదిగో యిటుచూడు. మీనాన్న నీ ఫోటోను ప్రకటించి, నీవు నేను కలిసి రెండువేల రూపాయల నగలు దొంగిలించి పారిపోయి వచ్చామనియు, మనలను కనుగొనినవారికి నూటపదహార్లు బహుమానమనియు, సర్వహక్కులూ ప్రభుత్వానికి ఇచ్చాననియు ప్రకటించాడని' చెప్ప దూరంగా వెళ్లి తలవంచి విచారిస్తూ కూర్చున్నాడు. సరస్వతిగుండె కరిగిపోయింది. చేతిలోనున్న ఫోటో కాస్తా క్రిందపడిపోయింది.

అల్లా అయితే ప్రసాద్ మనబోటివారికి యీ లోకంలో చోటులేదూ? అంటూ సరస్వతి వెక్కి వెక్కి యేడుస్తూ, ప్రసాద్ వద్దకువచ్చి కూర్చున్నది. ప్రసాద్ ఆమెను కౌగిటలో తీసికొని భయపడకుసరూ మన హృదయాలు మనకు తెలియకుండగనే బంధించుకొనిపోయాయి. ఇక విడిపోవడం కష్టం. 'మనకీ లోకముతో పనియేలేదు. మనకొరకు మరోలోకముంది. అక్కడ అనంతమైన సుగంధవాహనులు మెరుస్తూ ప్రవహిస్తూవుంటాయి. కోయిలలు హృదయ విపంచిలను మీటుతూ ప్రేమగీతాలను పాడుతాయి. ప్రసూనాలు అమృతాన్ని అందిస్తూవుంటాయి. పూల పొదరిండ్లలో విహరించవచ్చు' అని ముద్దిడుకున్నాడు. సరేనన్నది సరస్వతి రెండుహృదయాలు నవ్వుకున్నాయి. పిల్లగాలులు మంగళధ్వనులను మోసుకొని తెస్తున్నాయి.

చాలా పొడుగాటినీడలు వచ్చిపోయాయి వెర్రి లోకం వారినిచూసి అనుమానపడుతుంది. వెర్రిగా నవ్వుతుంది. ఆనాడు రాత్రి అమావాస్యగాబోలు అంధకారబంధురంగావుంది. మెరీనాబీచి ఖాళీగానే వుంది అక్కడక్కడ పయ్యెదలమీద పరుండి నాలుగు మధుప్లుతాధరములతో మధురప్రేమ గీతాలల్లే ప్రేమమయ జంటలు తప్ప, తీరాన్ని వెంబటి యిద్దరువ్యక్తులునడుస్తూ వెళ్లుచున్నారు. 'రా, రా' అంటూ వచ్చి తనలో లీనమయిపోమని సాగరసంగీతము భయంకరంగా వినిపిస్తూ వుంది. ఆ వ్యక్తులిద్దరూ నడుములకు బెల్టులు బిగించుకొని కదలి పొంగులోకి కదలిపోయారు. పెద్ద తాడిప్రమాణములాంటి తరంగ మొకటివచ్చి ఆ యిద్దరిని ఒక్కసారిగా తీసుకొని వెళ్ళింది. నీలాల నింగినుండి తారొకటి రాలింది.


# FREE

## *FANCY WRIST WATCH*

Our medicine genuine 'JOHR-I-HUSAN' (Regd.) removes hair from any part of the body. By its use no hair will grow there in your life time. The skin becomes smoth, soft and beautiful like silk. Price per bottle Rs. 1/15/-.

To make this medicine famous, **a fancy wrist watch is given free with every bottle** as a present. This watch is strong aud beautiful for which we give a guarantee of ten years. Guarantee receipt is sent with every watch.

IMPORTANT NOTE:—If the goods are not approved the price wil be **refunded**. Buyers of **3 bottles** at a time will get **3 fancy wrist watches and freel postage**.

GENERAL SUPPLY CO.,

Post Box No. 39 (K. M.) Amritsar (India)